ప్రజాశక్తి
సోమవారం 5 డిసెంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మావోయిస్టు పిఎల్‌జిఎ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని లోతేరు రోడ్డు వద్ద ఆదివారం పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు, ద్విచక్ర వాహనాలు నిలుపుదల చేసి రికార్డులను పరిశీలించారు. ఆర్టీసీ బస్సులను సైతం ఆపి ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ పి.రమేష్ పర్యవేక్షణలో రెండు

వాలీబాల్ ఆడుతున్న మహిళా క్రీడాకారులు

రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఆదివారం పురుషులకు క్రికెట్, పురుషుల, మహిళలకు కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పురుషుల క్రికెట్ పోటీల్లో అరకు నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు ప్రథమ స్థానాన్ని, రంపచోడవరం నియోజకవర్గ క్రీడాకారులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పురుషుల కబడ్డీ పోటీల్లో రంపచోడవరం నియోజకవర్గ క్రీడాకారులు ప్రథమ స్థానాన్ని, అరకు క్రీడాకారులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పురుషులు వాలీబాల్ పోటీల్లో అరకు ప్రథమ స్థానాన్ని, రంపచోడవరం ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మహిళల కబడ్డీ పోటీల్లో అరుకు ప్రథమ స్థానాన్ని, రంపచోడవరం ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మహిళల వాలీబాల్ పోటీల్లో పాడేరు క్రీడాకారులు ప్రథమ స్థానాన్ని, అరకు నియోజకవర్గ క్రీడాకారులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలకు డిఇఒ మెమోంటోలు అందజేశారు.

మోదకొండమ్మ ఆలయం కిటకిట

అమ్మవారిని దర్శించుకున్న డిఇఒ దంపతులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్:స్థానిక మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మైదాన ప్రాంతానికి చెందిన వంద లాది మంది భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి దర్శనానికీ బారులు తీరారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కులు బడులు ఉన్న కొంత మంది భక్తులు వంటలు చేసుకోగా, మరి కొంత మంది ఆయ ప్రాంగణంలో బివిఎస్ ముకుందరావు, సిద్ధినాతి కొండలరావు, కొట్టగుళి రామారావుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. డిఇఒ దంపతులను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఆలయంలో భక్తులు

మత్స్యగుండం అభివృద్ధికి కృషి

తహశీల్దార్ వి.రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని మఠం పంచాయతీ పర్యాటక ప్రాంతమైన మత్స్యగుండం మత్స్యలింగేశ్వరస్వామిని తశీల్దార్ వి.రాజ్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో పూజలు చేసి కంచు వస్తువులను మత్స్య లింగేశ్వర స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తే పర్యటికుల ద్వారా వచ్చే ఆదాయం గ్రామ పంచాయతీకి, ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని ఆమె అన్నారు. మత్స్యగుండం అభివృద్ధికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డిటి శ్రీనివాస్, మఠం పంచాయతీ సర్పంచ్ మఠం శాంత కుమారి, గ్రామ పెద్దలు టి.అప్పారావు, ఏం.చంద్ర శేఖర్ నాయుడు, డి. రామలింగం, వార్డు సభ్యులు పాంగి మత్స్య కొండ బాబు, మఠం సింహాచలం నాయుడు, గ్రామ యువత హరినాధ్, రాంబాబు, సింహాచలం పాల్గొన్నారు.

ఆలయానికి కంచు ప్రతిమలను ఇస్తున్న తహశీల్దార్

మన్యానికి పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి-పాడేరుటౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఏజెన్సీలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పాడేరు మండలంలోని వంజంగి హిల్స్ ఆదివారం పర్యాటకుల తాకిడితో కిటకిటలాడింది. వేకువ జామున మంచు అందాల మధ్య సూర్యోదయం దృశ్యాలు, ప్రకృతి అందాలను వీక్షించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వంజంగి హిల్స్‌కు చేరుకున్నారు. తెల్లవారుజామున పాల సముద్రంలా కనిపించే మేఘాలు చూడ ముచ్చటగా ఉండే దృశ్యాలను తిలకించారు. వంజంగి శిఖర ప్రాంతాలలో ఉదయం 9 గంటల వరకు కొండల నిండా మంచు తెరలు కనివిందు చేశాయి. జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం తిలకించేందుకు సందర్శకులు పోటెత్తారు. ఈ ప్రకృతి అందాన్ని చూసేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యటకులు పెద్ద సంఖ్యలో వచ్చి సందడి చేశారు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా జలపాతం వద్ద తడుస్తూ సందడి చేశారు. జలపాతం అందాలను కెమెరాలో బంధించేందుకు, సెల్ఫీలతో యువతీ యువకులు హంగామా చేశారు. వంజంగి హిల్స్, కొత్తపల్లి జలపాతం పర్యటకులతో కిటకిటలాడాయి.

వంజంగి హిల్స్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

మహిళా చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

జిల్లా మహాసభలో ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు పుణ్యవతి

ప్రజాశక్తి - విఆర్.పురం : మహిళా చట్టాలను పటిష్టంగా అమలు జరపడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా మహిళకు రక్షణ లేకుండా పోయిందని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.పుణ్యవతి అన్నారు. ఆదివారం మండలంలోని సున్నంవారి గూడెంలో మల్లు స్వరాజ్యం నగర్‌లో ఐద్వా రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. తొలుత ఐద్వా పతాకాన్ని మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య సతీమణి సున్నం సుక్కమ్మ ఆవిష్కరించారు. వీరనారీమణులు మల్లు స్వరాజ్యం, మోటూరి ఉదయం, మాణికొండ సూర్యావతి, పాయం సీతమ్మల చిత్రపటాలను పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరగిన సభలో పుణ్యవతి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై రోజురోజుకూ అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలను ఏమాత్రం అమలు చేస్తున్నారో నేడు సమాజంలో జరిగే పరిణామాలను చూస్తే ఇట్టే అర్థమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో మహిళలంతా సమాజం పట్ల అవగాహన పెంపొందించుకోవాల న్నారు. మహిళా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ మహిళా చట్టాల అమల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిపై మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఐద్వా ఉద్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు మర్లపాటి రేణుక, ఐద్వా ఎపి రాష్ట్ర కమిటీ సభ్యులు ఇసంపల్లి పద్మ, జిల్లా నాయకులు ముర్రం రంగమ్మ, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, కుంజ రాధ, సున్నం పార్వతి, నాగమ్మ, వీరమ్మ, జ్యోతి అమ్మాజీ వెట్టి. లక్ష్మి. నాగమణి కారం. బుచ్చమ్మ పూనం.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా రంపచోడవరం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న పుణ్యవతి

సత్యసాయి వాటర్ వర్కర్ల భిక్షాటన

11వ రోజుకు రిలే దీక్షలు

రంపచోడవరంలో భిక్షాటన చేస్తున్న సత్యసాయి వాటర్ వర్కర్లు

ప్రజాశక్తి- రంపచోడవరం/ రాజవొమ్మంగి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రంపచోడవరం ఐటిడిఎ ఎదుట సత్యసాయి వాటర్ వర్కర్స్ చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 11వ రోజుకు చేరుకున్నారు. తాము 11రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోని యాజమాన్య వైఖరికి నిరసగా రంపచోడవరం సెంటర్‌లో. వర్కర్స్ భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మట్ల వాణిశ్రీ, పి రామరాజు, సత్యసాయి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు త్రిత్వదాసు, కిశోర్‌కుమార్, బాలరాజు మాట్లాడుతూ వాటర్ వర్కర్లకు బకాయిపడ్డ పది నెలల వేతనాలు వెంటనే చెల్లించి, కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ఐటిడిఎ ఎదుట 11 రోజులుగా దీక్షలు చేస్తున్నా అటు అధికారులుగానీ, ఇటు సంబంధిత కాంట్రాక్టర్‌గానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సత్యసాయి వాటర్ వర్కర్ల దీక్ష కేవలం వారి వేతన సమస్య మాత్రమే కాదని, దీని వల్ల మన్యంలోని అనే గిరిజన గ్రామాల ప్రజల తాగునీటి సమస్యగా ఐటిడిఎ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గమనంలో పెట్టుకుని సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికే మారేడుమిల్లి మండలంలో 11రోజులుగా సత్యసాయి వాటర్ పంపింగ్ నిలిచి గిరిజనులు తాగునీటికి అవస్థలు పడుతూ, కొండవాగులు, చెలమలను ఆశ్రయిస్తున్నారన్నారు. 2017లోనూ ఇలాంటి పరిస్థితి ఎదురు రావడంతో చాపరాయి గ్రామంలో అప్పట్లో 16, మంది మత్యువాత పడ్డారన్న విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. గిరిజన ప్రజల తాగునీటి అవసరాలు, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సత్యసాయి వాటర్ స్కీమ్ వర్కర్స్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సత్యసాయి వాటర్ వర్కర్ల సమస్యపై అధికారులు మరింత నిర్లక్ష్యం చేస్తే, సిఐటియు ఆధ్వర్యాన అన్ని కార్మిక సంఘాలను పెద్దఎత్తున ఐటిడిఎ ఎదుట ఆందోళన చెపడతామని హెచ్చరించారు.

మన్యంలో విస్తృత తనిఖీలు

వారపుసంతలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి- సీలేరు: మావోయిస్టుల పిఎల్‌జిఎ ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యం అప్రమత్తమైన పోలీసులు మన్యంలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా మావోయిస్టుల కదిలికలపై ప్రత్యేక నిఘా పెట్టి గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం సీలేరులోని వారపుసంతలో ఎస్ఐ రామకృష్ణ, సిఆర్‌పిఎఫ్, లోకల్ పోలీసు బలగాలతో తనిఖీలు చేపట్టారు. అపరిచిత వ్యక్తులపై నిఘా పెట్టి, వారపుసంతకు వచ్చిన కొంతమందిని ప్రశ్నించి, అనుమానం నివృతి చేసుకున్నాక విడిచిపెట్టారు. వాహన తనిఖీలతోపాటు పలువురు వ్యక్తుల వద్దనున్న బ్యాగ్‌లు, సంచుల్లోనూ సోదాలు నిర్వహించారు.

సీలేరు వారపుసంతలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

మావోయిస్టులకు సహకరించొద్దు

కొయ్యూరు : మావోయిస్టులు చెప్పే కల్లిబొల్లి మాటలను నమ్మి, వారికి సహకరించడం ద్వారా అభివృద్ధిని దూరం చేసుకోవద్దని స్థానిక సిఐ స్వామినాయుడు కోరారు. పిఎల్‌జిఎ వారోత్సవాల నేపథ్యంలో కొయ్యూరు ఎస్ఐ రాజారావు, పోలీసు బలగాల ఆధ్వర్యంలో బాలరేవుల రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. కొయ్యూరు వారపుసంతలో గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మావోయిస్టులకు సహకరించడం ద్వారా మన్యవాసులు ఇన్నాళ్లు సాధించిందేమీ లేదని, పైగా వారి వల్ల రహదారులు, సెల్‌టవర్లు, ఇతర అభివృద్ధి పనులకు ఏజెన్సీవాసులు దూరమయ్యారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. మరోవైపు సంఘ విద్రోహక శక్తులకు సహకరించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

కొయ్యూరులో గిరిజనంతో మాట్లాడుతున్న ఎస్ఐ

సీలేరు జల విద్యుత్ కేంద్రం రెండో యూనిట్‌లో

విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రంలో రెండో యూనిట్‌కు మరమ్మతులు చేపట్టి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. ఈ జల విద్యుత్ కేంద్రంలో 240 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్లు ఉండగా, సాంకేతిక సమస్య తలెత్తడంతో రెండోయూనిట్‌లో ఎనిమిది రోజుల క్రితం విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ఎపి జెన్‌కో ఇంజనీర్లు యూనిట్‌లో లోపాలు పరిశీలించి, అప్పర్ గైడ్ బేరింగ్ టెంపరేచర్ పెరిగి యూనిట్ ట్రిప్ అయి విద్యుదుత్పత్తి నిలిచిపోయినట్లు గుర్తించారు. యూనిట్లఓ సాంకేతిక లోపాలను ఇఇ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఇఇ లక్ష్మీనారాయణ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించారు. జెన్‌కో. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పిట్‌వెల్ కంపెనీతో సంప్రదించి, మరమత్తు పనులు చేపట్టాలని ఆదేశించారు. తక్షణమే రంగంలోకి దిగిన పిట్‌వెల్ యంత్రాంగం, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి ఎనిమిది రోజులు వ్యవధిలోనే పూర్తిచేసి రెండో యూనిట్ అందుబాటులోకి తెచ్చారు.

శనివారం రాత్రి మెకానిక్ టెస్టింగ్ పెట్టి యూనిట్ పనితీరును పరిశీలించిన ఇంజినీర్లు, యూనిట్ నుంచి ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకపోవడంతో పనితీరు బాగుందని భావించారు. యూనిట్ నుంచి విద్యుదుత్పత్తికి ఎపి జెన్‌కో ఇంజినీర్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.



మరమ్మతులు పూర్తయిన రెండో యూనిట్

చింతూరు మన్యంలో మంచు అందాలు

మంచు ముసుగులో మన్నెసీమ

చలిపులి కౌగిలిలో గిరిజనం గిజగిజ

ప్రజాశక్తి-చింతూరు : అల్లూరి జిల్లా చింతూరు రెవిన్యూ డివిజన్‌లో వారం రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉదయం ఏడెనిమిది గంటల వరకు భారీగా పొగమంచు కురుస్తూ, మన్య సీమ మంచు మునుగులో కప్పబడి కనిపిస్తోంది. కనుచూపుమేరలో తెల్లని మంచు తెరలు పరచుకోవడంతో భగభగలాడే ఉదయభానుని కిరణాలను అడ్డుకొని, పున్నమి వెన్నెల చంద్రుడిని తలపించేలా మన్యంలో మరో నవ లోకం దర్శనమిస్తోంది. చలిపులి కౌగిలిలో గజగజలాడుతున్న ప్రజలు చలిమంటల వెచ్చదనంతో సేద తీరుతున్నారు. ఉదయం పదిగంటలైనా వీడని మంచు ముసుగు, మళ్లీ మధ్యాహ్నం రెండుగంటలు ఇలా దాటిందో లేదో, మళ్లీ ముసుగేసే పరిస్థితి కనిపిస్తోంది. మంచుముసుగులో మన్యం అందాలను తిలకించేందుకు గజగజలాడే చలినిసైతం వెరవకుండా ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలకు ప్రకృతి ప్రేమికులు క్యూకట్టడంతో అంతటా సందడి వాతావరణం కనిపిస్తోంది.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో శని ఆదివారాల్లో తెల్లవారుజాము నుంచే కొండకోనలతోపాటు జనావాసాలను మంచు ఆవరించి కనిపిస్తోంది. వ్యాపారులు దుకాణాలు ఆలస్యంగా తెరిచారు. చలి తీవ్రత కొంచం తగ్గినట్లు అనిపించినా, మంచు తీవ్రత మాత్రం అధికంగా ఉంటోంది. మునుపు ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భిన్న వాతావరణం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఎప్పుడు చలి ఉంటుందో ఎప్పుడు చలి తగ్గుతుందో ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది.

సీలేరులో ఉదయం పది గంటలైనా వీడని పొగమంచు

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే పెట్ల

ప్రజాశక్తి- నాతవరం:అభివృద్ధి పనులకు సిఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నర్సీపట్నం శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. మండలంలో శృంగవరం గ్రామం నుండి కాకినాడ జిల్లా సరిహద్దు ఉప్పరగూడెం వరకు సుమారు మూడు కిలోమీటర్లన్న మేర సుమారు 12 కోట్లతో రోడ్డు విస్తరణ పనులను నర్సీపట్నం శాసనసభ్యులు ఉమా శంకర్ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, గతంలో ఏ నాయకుడు చేయలేని విధంగా వేల కోట్ల రూపాయలతో నర్సీపట్నం నియోజకవర్గానికి అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి దేశంలో ఒక్క వైయస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని కొనియాడారు.రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేపడతామని తెలిపారు. కాకినాడ సరిహద్దు వద్ద గెడ్డపై తుఫాన్ సమయాల్లో చాలా ప్రమాదాలు జరుగుతున్నట్లు, ఆ సమస్య స్థానికులు తమకు వివరించడం జరిగిందన్నారు. వెంటనే ఈ విషయం ముఖ్యమంత్రికి తెలియజేసి రోడ్డు మంజూరు చేయించడం జరిగిందన్నారు. నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కోటి 50లక్షలతో పక్కా భవనాన్ని నిర్మించామని చెప్పారు. గునుపూడి పిహెచ్సికి రూ.25 లక్షలు మంజూరు చేశామన్నారు. చీడిగుమ్మల పిహెచ్సికి నిధులు మంజూరు చేస్తామన్నారు. నర్సీపట్నం సిబిఎస్ఇ కాంపౌండ్ నుండి డిగ్రీ కళాశాల వరకు రూ.25 కోట్లు రోడ్డుకు నిధులు అందించా మన్నారు. ఈ విధంగా నర్సీపట్నం నియోజకవర్గానికి ఇన్ని వేల కోట్ల రూపాయలు ఇచ్చినందుకు జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిని లక్ష్మణ మూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, నాగ గోపి, స్థానిక సర్పంచ్ ఉబలాల శ్రీను, మండల పార్టీ అధ్యక్షులు పైల సుకుమార్, సీనియర్ నాయకుడు సబ్బవరపు వెంకయ్య నాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అడిగారా నాయుడు, మొత్తంశివాజీ, కనకరాజు పాల్గొన్నారు.

369వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో ఫార్మా పైప్ లైన్కు వ్యతిరేకంగా మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహా ధర్నా ఆదివారం నాటికి 369 వ రోజుకు చేరింది. శిబిరం వద్ద మత్స్యకారులు పైపులైన్కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. మత్స్యకారుల జీవన విధానానికి నష్టం కలిగించే పైప్ లైన్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని మత్స్యకారులు డిమాండ్ చేశారు. సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి మైలపల్లి మహేష్బాబు, మత్స్యకారులు గోసల సోమేశ్వరరావు, మైలపల్లి బాపుజీ, మైలపల్లి శివాజీ, కొర్లాం కాశి, కొద కాశి, కారే కోదండరావు చొడిపల్లి రాజు, దేముడు, వీర్రాజు, చిరంజీవి పాల్గొన్నారు.

అయోమయంలో జగనన్న గృహ లబ్దిదారులు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోటలో జగనన్న గృహ లబ్దిదారుల్లో తీవ్ర అయోమయం నెలకొంది. ఏడాది కాలంగా ఇళ్ల నిర్మాణానికి నోచుకోక పోవడంతో పలువురు లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన సుమారు 240 మంది పేదలకు జగనన్న గృహ పథకంలో భాగంగా దిబ్బలపాలెం సమీపంలో స్థలం కొనుగోలు చేసి ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇందులో సుమారు 106 మంది పేదలు సొంతంగా ఇల్లు నిర్మాణం చేసుకోలేక చోడవరానికి చెందిన ఓ సంస్థకు కాంట్రాక్ట్ పద్దతిలో ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే లక్షా 80 వేలతో పాటు లబ్దిదారుల వాటాగా మరో లక్షా 50 వేలు కలిపి ఇచ్చేందుకు తీర్మానం చేసుకున్నారు. మొదటి దఫాగా ఒక్కో లబ్దిదారుడు రూ.25 వేల చొప్పున స్థానిక వైసీపీ నాయకుల మధ్య వర్తిత్వంతో చెల్లించారు. దీనికి స్థానిక నాయకుల రసీదులు కూడా ఇప్పించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా సంస్థ ద్వారా నిర్మాణ పనులు సాగక పోవడంతో లబ్దిదారులు పలు మార్లు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఇల్లు అయినా నిర్మించండి లేదా సొమ్ము అయినా తిరిగి ఇవ్వండి అంటూ నిలదీయడంతో స్థానిక నాయకులు సర్ది చెప్తూనా వస్తున్నారు. కానీ ఇల్లు నిర్మాణ పనులు జరగ లేదు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-చీడికాడ :మండలంలోని కండివరం గ్రామం నుండి వీరభద్రపేట వరకు తారు రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.35 లక్షల నిధులను మంజూరు కావడంతో పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కురచా జయమ్మ నారాయణ మూర్తి, వైస్ ఎంపిపి లాలం శరద వరలక్ష్మి జానకిరామ్, వైసిపి సీనియర్ నాయకులు సుంకర శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మోసూరు సన్ని బాబు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ సూర్యానారాయణ, ఎంపిటీసీ గెంజి స్వాతి బాలాజీ, వీరభద్రపేట సర్పంచ్ నరసింహమూర్తి, కండివరం గ్రామ కమిటీ అధ్యక్షులు సుంకర కొండబాబు, మాజీ సర్పంచ్ ముత్యాల నాయుడు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న కాఫీ కార్మికులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కాఫీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మినుములూరు కాఫీ కాలనీలో కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు మాట్లాడుతూ, కాఫీ కార్మికులకు రోజువారి కూలీ పండ్ల సేకరణ రేట్లు పెంచాలని, లేకుంటే కాఫీ పండ్ల సేకరణ ఆపేస్తామని హెచ్చరించారు. కార్మికులకు ప్రతీ ఏడాది విడిఎ పాయింట్లు ప్రకారం పెంచాల్సిన పండ్ల రేట్లు సేకరణకు ముందుగానే పెంచాల్సి ఉన్నా ఎపిఎఫ్ డిసి అధికారులు ఇంత వరకు పెంచలేదన్నారు. దీంతో కార్మికులు రోజుకు రూ.26 నష్ట పోతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాఫీ తోటల్లో పని చేస్తున్న దిగువ స్థాయి సిబ్బంది (హెల్పర్స్)కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, క్షేత్ర స్థాయిలో ఖాళీగా ఉన్న సిబ్బంది నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐడిఎఫ్, ఇఎస్ఐ పరిష్కరించాలని, నైట్ వాచ్ మెన్లకు వేతనం ఇవ్వాలని, కార్మికుల నివాసం ఉంటున్న క్వార్టర్స్ మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, కాఫీ తోటల్లో జరిగే ప్రమాదాలకు యాజమాన్యం బాధ్యత వహించాలని, మెడికల్, రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కాంతమ్మ, కాఫీ కార్మిక సంఘం నాయకులు వరలక్ష్మి, దేవి, చిన్నాలమ్మ, భీమరాజు, లక్ష్మి, మణి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతం, మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కర్లపొదోర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాడు నేడు రెండవ దశలో నూతన భవనం నిర్మాణం చేపట్టేందుకు ఆదివారం స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్, ఎంపీటీసీ వి.సాధురం, పాఠశాల ఉపాధ్యాయుడు లైకోన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, గతంలో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరి మరమ్మతులకు గురివడంతో అనేక మార్లు పాడేరు జిల్లా కలెక్టర్కు స్పందనలో వినతి పత్రాలు సమర్పించి విన్నవించామని తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నాడు నేడులో భాగంగా రెండవ విడత నిధులు రూ. 38 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్కు ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ కృతజ్ఞతలు తెలిపారు. నూతన భవన నిర్మాణ పనులు జాప్యం జరగకుండా వేగవంతం చేసి, నాణ్యత పరి మాణాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు లైకోన్, విద్యా కమిటీ చైర్మన్ కే.గోపాల్, గ్రామస్థులు వి.నీలకంఠం, కే.సోమనాథ్, జయబాబు, మొస్య పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఓటర్ల నమోదుకు 245 దరఖాస్తులు


తొలి ఓటు నమోదు చేసిన విఆర్ఒ బాలయ్య

ప్రజాశక్తి - అడ్డతీగల : అడ్డతీగల మండలంలో ఆదివారం స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఎల్ఒలు, రెవెన్యూ సిబ్బంది నూతన ఓటు నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని 22 పంచాయతీల పరిధిలోని 42 పోలింగ్ కేంద్రాల్లో 18ఏళ్లు నిండిన యువతీ యువకుల నుంచి ఓటర్ల నమోదుక ఫారం 6 దరఖాస్తులను స్వీకరించారు42 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఆదివారం సాయంత్రానికి కొత్త ఓట్ల నమోదకు 245 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ శ్రీనివాస్ వెల్లడించారు. అర్హులైన వారు ఓటు నమోదుకు స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

నేడు తహశీల్దార్ కార్యాలయంలో స్పందన

స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విఆర్ఒ బాలయ్య పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన అనిల్కుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - అడ్డతీగల : మండలంలోని భీముడు పాకల గ్రామం మలుపు వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలేశ్వరం గ్రామానికి చెందిన సిహెచ్ అనిల్కుమార్ అనే వ్యక్తి తలకు తీవ్ర గాయమైంది. ద్విచక్ర వాహనంపై అడ్డతీగల వచ్చి, తిరిగి ప్రయాణంలో ఏలేశ్వరం వెళుతుండగా బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురికావడంతో అనిల్కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- ఎస్.రాయవరం:మండలంలోని మత్స్యకార గ్రామమైన బంగారమ్మపాలెం గ్రామంలో అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో మాట్లాడుతూ, వేటకు వెళ్లలేని సమయంలో తగిన పారితోషికం నేవీ అధికారులతో మాట్లాడి ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. మత్స్యకార సంఘాల నిధులను విడుదల చేశామని తెలిపారు. స్థానిక మత్స్యకారులు మాట్లాడుతూ, ఏడు సంఘాలకు గాను ఆరు సంఘాల నిధులు విడుదల చేసారని, ఒక్క సంఘం నిధులు విడుదల కాలేదని తెలిపారు. సంఘం నిధుల పరిమితి పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం, ఎస్డీసీ (నేవీ) లక్ష్మణమూర్తి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలో తురకలపూడి, చింతపాక గ్రామాల్లో చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామస్తులకు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. పెరిగిన ధరలు, నిరుద్యోగం, ఇసుక కొరత, నిరుద్యోగం తదితర అంశాలపై ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గోనూరు మల్లు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, డొంకెన అప్పలనాయుడు, మాజీ డిసిసిబి డైరెక్టర్ కోరుకొండ రవికుమార్, సాయం శేషు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ఈ నెల 5న గొలుగొండ మండలంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

పోరాటాలకు సిద్ధంకండి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అనకాపల్లి : సమస్యల పరిష్కారానికి వ్యవసాయ కార్మికులు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక, కర్షక నిలయంలో ఆదివారం సంఘం 13వ జిల్లా మహాసభలు ఎం.సత్యనారాయణ, యు.సత్యవతి అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలతో పాటు పదో రత్నంగా భూ పంపిణీని చేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మికులు ఉద్యమిస్తారన్నారు. అనకాపల్లి జిల్లాలో పేదల భూములు అన్యాక్రాంతమవు తున్నాయన్నారు. వీటిని సమగ్ర భూ సర్వే హక్కుదారులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. 200 పనిదినాలకు పెంచి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు సంఘం రాష్ట్ర మహాసభలు జంగారెడ్డిగూడెంలో జరుగనున్నాయని, ఆ సభల్లో రాష్ట్రవ్యాప్తంగా కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలకు రూపకల్పన చేస్తామని అన్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన కోసం పోరాటం చేయడంతో పాటు మార్చి నెలలో భూ పోరాటాన్ని ఉధృతం చేయనున్నామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి డి.వెంకన్న, నాయకులు కె.గోవిందరావు, ఇ.నరసింహమూర్తి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, గండి నాయనబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. అల్లిపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లా ఎఐఎస్ఎఫ్ నిర్మాణ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ హాస్టల్స్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం కోసం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించాలన్నారు. వారితోనే రాత్రి బస చేయాలన్నారు. వసతి గృహాల్లో మెస్ ఛార్జీలను ఎనిమిదేళ్లుగా పెంచలేదన్నారు. బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ హాస్టళ్లలో 463 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, తక్షణమే భర్తీ చేయాలని కోరారు. 9 నెలలుగా కాస్మోటిక్ ఛార్జీలను చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ఈ నెలలో రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. వైజాగ్ స్టీల్ప్లాంట్ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్.శ్రీను, యు.నాగరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బి.బాబ్జీ, జి.ఫణీంద్ర ఎన్నికయ్యారు.

బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ రుణమేళా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్తు అసెంబ్లీ హాల్లో ఆదివారం రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరై రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా బ్రాహ్మణులు స్వయం ఉపాధి పొందేందుకు అనేక పథకాలను రూపొందించామన్నారు. అర్హులందరికీ రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు.

తీరంలో నేవీ విన్యాసాల విందు

యుద్ధనౌకలు, విమానాలు, జలాంతర్గాముల సందడి
ఒళ్లు జలదరించేలా యుద్ధ ఘట్టాల ప్రదర్శన
ఆనంద సాగరంగా మారిన నగరం
పలు ప్రాజెక్టులను ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ సాగర తీరం ఆదివారం సాయంత్రం నావికాదళ సాహస విన్యాసాలతో వీనుల విందుగా మారిపోయింది. 'రంయ్..రంయ్' అంటూ భారీ శబ్దాలను చేసుకుంటూ యుద్ధ వాతావరణం తలపించేలాగ నౌకాదళ విన్యాసాల ప్రదర్శన సాగింది. తూర్పు నౌకాదళానికి చెందిన యుద్ధనౌకలు, విమానాలు, జలాంతర్గాములు చేసిన సందడితో వీక్షకులు ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. అనుకోకుండా యుద్ధమే గనక వస్తే ఎలాంటి సన్నాహాలు, సంసిద్ధతలు, శక్తి సామర్థ్యాలు మన నావికాదళం వద్ద ఉన్నాయో అవన్నీ కళ్లెదుట సాక్షాత్కరించాయి. 'సుప్రీం కమాండర్ ఆఫ్ ద ఆర్మ్డ్ ఫోర్సెస్'గా పిలవబడే భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖ తీరంలో జరిగిన విన్యాసాల విందుకు ముఖ్య అతిథిగా హాజరై 'అద్భుత విన్యాసాలకు' సాక్షిగా నిలిచారు. భారత నౌకాదళం ఏటా ఢిల్లీలో నిర్వహించే 'ఇండియన్ నేవీ డే డిసెంబర్ 4'కు ఈసారి విశాఖ ఆతిథ్యం ఇచ్చింది. నేవీ డే వేడుకలు మొట్టమొదటసారిగా ఢిల్లీకి బయట జరగడం విశేషం. ఈ జాతీయ వేడుకకు తూర్పు నౌకాదళం ఆతిథ్యం ఇవ్వాల్సి రావడం ఈ ప్రాంత ప్రజలకు మరింత ఆనందాన్నిచ్చే అంశంగా మారింది. నేవీ బ్యాండ్ మేళా శరత్ కుమార్ సింగ్ నేతృత్వంలో ఆకట్టుకునేలా సాగింది. 'కాల్ ఆఫ్ ద బ్లూ వాటర్స్' అనే ఫిలింలో గీతాలను ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు శంకర్మహదేవన్ ఆలపించారు.

శత్రుమూకలపై దాడులు చేస్తున్న నావికులు

దేశాభివృద్ధిలో సముద్రాలదే కీలక పాత్ర : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

'దేశాభివృద్ధిలో సముద్రాలు కీలక పాత్రపోషిస్తున్నాయి... జాతీయ సముద్ర ప్రయోజనాలకు భద్రత కల్పించే బాధ్యత నౌకాదళానిదే!' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. భారత నౌకాదళ దినోత్సవ వేడుకకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన నావికాదళ విన్యాసాలను వీక్షించిన అనంతరం ప్రసంగించారు. దేశ సనాతన సంప్రదాయ, సంస్కృతీ చరిత్రను భవిష్యత్తుకు అన్వయించి ముందుకు సాగాలన్నారు. దేశంలో మూడువైపులా సముద్రం, నాలుగో వైపు ఎత్తయిన పర్వతాలతో మనది స్వాభావిక సముద్ర దేశం అని రాష్ట్రపతి వెల్లడించారు. దేశాభివృద్ధి, శ్రేయస్సులో మహాసముద్రాలు కీలకపాత్ర పోషించాయన్నారు. భారతదేశ దృక్కోణానికి అనుగుణంగా నావికాదళం శక్తిసామర్థ్యాలతో ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభా వేదిక నుంచే ద్రౌపది ముర్ము తాను ప్రారంభించిన, శంఖుస్థాపన చేసిన పలు ప్రాజెక్టుల గురించి మాట్లాడారు. భారతదేశ సమగ్ర, సమ్మిళిత అభివృద్ధికి రహదారులు, గిరిజనులకు పాఠశాలలు, ఆర్ఒబిలు ఎంతో దోహదపడతాయని వెల్లడించారు. అంతరాలను పూడ్చుకునే అడుగులు ముందుకు పడితేనే అభివృద్ధి చెందిన భారతదేశంగా, కొత్త శక్తిగా అవతరిస్తుందని అన్నారు.

జనం అవస్థలు.. పాస్లపై కలెక్టర్ కార్యాలయానిదే పెత్తనం..

కరోనా మహమ్మారి విజృంభణ కారణంగా గడచిన రెండేళ్లు నేవీ డే విశాఖలో జరగలేదు. దీంతో అత్యధిక మంది ప్రజానీకం ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా ఈ సారి హాజరైనా సభా వేదిక పరిసరాల్లోకి రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. అత్యధికంగా పోలీసు, నేవీ ఆంక్షలు అమలయ్యాయి. విన్యాసాల కోసం జారీ అయిన పాస్లపైనా కలెక్టరేట్ పెత్తనం కనిపించింది. ప్రజలెవ్వరికీ పాస్లు అందలేదు. దీంతో వచ్చిన జనాలను ఎక్కడికక్కడే పోలీసులు అడ్డుకోవడం కనిపించింది. పాస్లు జిల్లా కలెక్టరేట్ అదుపులో పెట్టుకుని ప్రజలకు ఇవ్వకుండా కేవలం ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకే అమ్ముకోవడమో, పంచిపెట్టడమో జరిగింది. నావికాదళ అధికారులు వారి వారి ఉద్యోగ, అధికార, కుటుంబ సభ్యులకు పాస్లు జారీచేసుకున్నారు. దీంతో వేల సంఖ్యలో ప్రజలు పూర్తిస్థాయిలో విన్యాసాలను తిలకించలేక సుదూరం నుంచే వెనుతిరగడం ఆదివారం సాయంత్రం పలుచోట్ల కనిపించింది. చినవాల్తేరు జంక్షన్ వద్దనే వేల సంఖ్యలో జనాన్ని నిలిపేయడంతో వీరికి పూర్తిగా విన్యాసాలు (పై నుంచి వెళ్లే విమానాలు తప్ప) ఇంకేమీ కనపడలేదు.

విన్యాసాలను వీక్షిస్తున్న ప్రజలు

నేవీ ఉత్సవ వేదికపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, తదితరులు

హై రిస్క్ ప్రసూతి వార్డును ప్రారంభిస్తున్న మంత్రి రజని

వైద్య రంగానికి పెద్దపీట

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో వైద్య రంగానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్ఛార్జి మంత్రి విడదల రజని అన్నారు. పాత నగరంలోని విక్టోరియా ప్రభుత్వ గోషాసుపత్రిలో రూ.కోటీ 15 లక్షల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన హై రిస్క్ ప్రసూతి వార్డును ఆమె ఆదివారం ప్రారంభించారు. ముందుగా ఆసుపత్రిలోని గర్భిణుల నిరీక్షణ గది, తదితర వాటిని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోషాసుపత్రికి గొప్ప చరిత్ర ఉందని, రానున్న కాలంలో నాడు - నేడు కింద అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఇప్పటికే సిఎస్ఆర్ నిధులు రూ.1.15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. హైరిస్క్ ప్రసూతి వార్డును అన్ని వసతులతో తీర్చిదిద్దామని, ఇది 24/7గా పని చేస్తుందని తెలిపారు. ఆసుపత్రిలో గర్భిణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. విద్యుత్ మరమ్మతు పనులు, తదితరమైన వాటితో పాటు దోమల మెస్ కూడా ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి విభాగాధిపతికీ ఆయా విభాగాలలో అవసరమైన పనుల కోసం రూ.లక్ష చొప్పున నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. గోషాసుపత్రిలో నెలకు సుమారు 900 ప్రసవాలు జరగడం గొప్ప విషయమంటూ వైద్యుల సేవలను మెచ్చుకున్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా మరింత మెరుగ్గా సేవలు అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వం నాడు - నేడు కింద ఆసుపత్రిలో సుమారు రూ.120 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు వివరించారు. ప్రతి వారం వివిధ విభాగాధిపతుల నుంచి రిపోర్టులు తీసుకొని, సమస్యలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపేట వేస్తోందన్నారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ నియోజక వర్గంలో ఉన్న కెజిహెచ్, గోషాసుపత్రిల్లో ఉన్న సమస్యలను శాసన సభలో చర్చించినట్టు తెలిపారు. గతంలో వివిధ జిల్లాల నుంచి పేషెంట్ల విషయమై ప్రజాప్రతినిధులు ఫోన్లు చేసేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, అన్ని జిల్లాల్లో అన్ని వసతులతో ప్రభుత్వాసుపత్రులు అభివృద్ధి బాట పట్టాయని వివరించారు. ఆసుపత్రిలో ఒకే పడకపై ఇద్దరు గర్భిణులు ఉండేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి మారిందని తెలిపారు. అందరికీ సరిపడా పడకలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అదనపు డిఎంఇ సత్యవరప్రసాద్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మైథిలి, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, గోషాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషా, ఎఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు, ఎపిఎంఎస్ఐడి పిఎ.నాయుడు, ప్రొఫెసర్ డాక్టర్ గీతావందన, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని పేద ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆయుష్మాన్ ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు. కెజిహెచ్ ఎదురుగా ఏర్పాటైన ఆయుష్మాన్ ఆసుపత్రిని ఆదివారం ఆమె ఆసుపత్రి సిఇఒ డాక్టర్ స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం భారం కాకుండా చూడాలన్నారు. ఈ ఆసుపత్రిలో 24 గంటలూ అన్ని వ్యాధులకూ సరైన వైద్యులు అందుబాటులో ఉంటారని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ కనబరుస్తున్నట్టు తెలిపారు. ఆయుష్మాన్ యాజమాన్యం పేద ప్రజల కోసం మురికివాడల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన వారికి అన్ని పరీక్షలూ చేసి, ఉచితంగా మందులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు.